# నటి

- వీరభద్రరావ్ పమ్మి

నేనప్పుడు ఎం. ఎ. ఫైనలియర్ చదువుతున్నాను. చదువుకునేందుకు సదుపాయంగా వుంటుందని హాస్టలొదిలేసి ఆ మేడమీద గది అద్దెకు తీసుకున్నాను. నా గది ఆ మేడమీద మూలగా ప్రశాంతంగా వుండేది. పైన, కింద చాలా వాటాలుండేవి. అందులో ఎవరెవరుంటున్నారో నేను పట్టించుకునేవాణ్ని కాదు. ఓ ఆదివారం మధ్యాహ్నం నిద్రపోతుంటే ఎవరో తలుపు కొట్టారు. కళ్ళు నులుముకుంటూ తలుపు తీశాను.

ఎదురుగా ఓ పదహారేళ్ళ ఆడపిల్ల లంగా,వోణీ... కొత్త బట్టలు కట్టుకుంది. తలంటు పోసుకుంది. చేతిలో ఆకు కప్పిన ప్లేటు...

ఆమె ఎవరో నాకు తెలియదు. నేనా గదిలో చేరిన ఇరవై రోజుల్లోను నాలుగైదుసార్లు ఆమెను ఆ కాంపౌండ్‌లో చూశాను.

ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాను.

'మేం కిందవాటాలో ఉంటున్నాం- నాన్నగారిపేరు గిరిజాపతి- బ్యాంకులో ఉద్యోగం... నా పేరు అరవింద- ఇంటర్మీడియట్ చదువుతున్నాను."

'ఇవన్నీ ఏమిటి?' ఆమె చేతిలోని ప్లేటు వైపు చూపిస్తూ అడిగాను.

'బొబ్బట్లు...ఈవేళ నా పుట్టినరోజు. మీకివ్వాలని అమ్మతోచెప్పి తీసుకొచ్చాను." గబగబా చెప్పేసింది.

'ఎందుకమ్మా ఇవన్నీ..."

"తినడానికి"- నేను చెప్పడం పూర్తికాకుండానే అనేసి పకపక నవ్వింది.

ఆ విధంగా అరవింద నాకు పరిచయమయ్యింది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ చలాకీగావుండే ఆమంటే నేనెంతో ఇష్టపడేవాణ్ని. ఆమె నవ్వితే సూర్యుడుదయించినట్టు, పచ్చటి పూలమొక్క పుష్పించినట్టు వుండేది.

కొద్ది రోజుల్లోనే నేనా ఇంట్లో మనిషినైపోయాను. పొద్దున్న నిద్ర లేచేసరికల్లా "గుడ్ మార్నింగ్ మాష్టారూ" అంటూ కాఫీతో ప్రత్యక్షమయ్యేది. సాయంత్రాలు నా రాకకోసం మేడమీద నిలబడి వీధంతా కలియచూసేది.

అప్పుడప్పుడు ఆమె చదువు విషయంలో సహాయం చేసినా ఆమె నన్ను 'మాష్టారూ!' అని పిలవడం నాకంతగా నచ్చేది కాదు. అదే చెప్పానామెకు.

"సారీ మాష్టారూ! మిమ్మల్నలాగే పిలవాలనిపిస్తుంది." అంది నవ్వుతూ—

ప్రతి ఆదివారం వాళ్ళింట్లో భోంచేసేవాణ్ణి. నా మంచి చెడ్డలు వాళ్ళెప్పుడూ కనుక్కునేవారు. వాళ్ళింట్లో మనిషిలాగ చనువుగా తిరుగుతుండేవాణ్ని. నే నేకారణం వల్లనైనా రూంకి రాలేక ఏ ఫ్రెండ్ రూంలోనో పడుకుంటే మర్నాడంతా నాతో నిష్ఠూరంగా మాట్లాడేది అరవింద.

మా చనువు చూసి చుట్టుపక్కల వాళ్లు చెవులు కొరుక్కుంటున్నారని ఆమె నాకు చెప్పిందోసారి—

"వాళ్ళనేం కేర్ చెయ్యక్కర్లేదు మాష్టారూ! పోతే వాళ్ళ చెవులే పోతాయ్." అంది తనే-

నాకు పరీక్షలు దగ్గర పడుతున్నాయ్...

అరవిందకు జ్వరం వచ్చింది-నాల్గయిదు రోజులకి తగ్గిపోయి పత్యం తీసుకుంది. రెండు మూడు రోజుల తర్వాత మళ్ళీ తిరగబెట్టింది టైఫాయిడ్ అన్నారు మొదట్లో. కొన్నాళ్లు పోయాక డబుల్ టైఫాయిడ్ అన్నారు. నెల్లాళ్ళపాటు మంచం మీదే వుండిపోయింది.

నేను రోజూ ఆమెకు ఉపచర్యలు చేసేవాణ్ని. మందు తాగించేవాణ్ని. మంచినీళ్ళిచ్చేవాణ్ణి. రాత్రిళ్ళు ఆమె నిద్రపోయేవరకు పక్కనే కూర్చుని కబుర్లు చెప్పేవాణ్ని. జ్వరతీవ్రత ఎక్కువయినప్పుడు తెల్లవార్లు పక్కనే కూర్చుని ఐస్‌బాగ్ నెత్తిమీద పెట్టేవాణ్ని.

"మీరిలా శుశ్రూషలు చేస్తుంటే నాకు ఇలా జ్వరంతో మంచం మీదే వుండిపోవాలని ఉంది మాష్టారూ!" అంటూ నవ్వేది.

అంత జ్వరంలోనూ, అంత నీరసంలోనూ ఆమె నవ్వు కోయిలపాటలా వినిపించేది. ఆమెలో అదే ఉత్సాహం, అదే మెరుపు.

ఓ భయంకరమైన రోజు తన నవ్వుని నాకు జ్ఞాపకంగా మిగిల్చి, నా ఉత్సాహాన్ని చంపేసి, నాగుండెని విరిచేసి అరవింద అనంతవాయుషల్లో కల్సిపోయింది.

అరవింద మరణం నామీద విపరీతమైన ప్రభావాన్ని చూపింది. ఆమె నాకన్నా వయస్సులో, విజ్ఞానంలో, చదువులో, తెలివితేటల్లో అన్ని రకాలుగా ఎంతో చిన్నది. నేనామెను ప్రేమించలేదు. కామించలేదు. కోర్కెల్ని పెంచుకోలేదు. కాని విపరీతంగా అభిమానించాను. ఆమె నన్ను ఆరాధించేది. మా స్నేహం ఒక రకమైన అనుభూతి. ఒక స్పందన. ఒక తియ్యటి కల. ఆమె మరణంతో నేనేదో పోగొట్టుకున్నానన్న భావం నన్ను వెంటాడింది. తిరిగి మామూలు మనిషిని కావడానికి చాలారోజులు పట్టింది.

* *

హైద్రాబాద్‌లో ఉద్యోగంలో చేరిన కొన్నాళ్ళకు స్నేహితులు కొందరు ఓ నాటిక రాసిపెట్టమని అడిగారు. అప్పటికే నేనెన్నో కథలు రాశాను. నాటిక రాయడానికి మంచి సబ్జెక్ట్ కావాలి. తీవ్రంగా ఆలోచించిన మీదట 'అరవింద' ను ఆధారంగా తీసుకుని ముఖ్యపాత్రను సృష్టించి చుట్టూ నాటిక అల్లాను. అనుకున్న దాని కంటె బాగా వచ్చింది నాటిక.

స్క్రిప్ట్ వాళ్ళకిస్తూ "ఆ పాత్రను ఏ మాత్రం మార్చకండి 'రొటీన్ ప్రేమ' ను జొప్పించడానికి ప్రయత్నించకండి. సమర్థురాలైన అమ్మాయిచేత ఆ పాత్ర వేయించండి" అన్నాను రిక్వెస్టింగ్‌గా. సరే నన్నారు మావాళ్ళు.

'రోహిణి' అనే అమ్మాయిని ఆ పాత్రకోసం ఎన్నుకున్నారు. ఆమెకదే మొదటి నాటిక. నాటకాలు వెయ్యాలనే ఉత్సాహం ఆమెకు, వేయించాలనే ఉత్సాహం ఆమె తండ్రికి వుండి. తర్ఫీదు ఇస్తే ఆ వేషం బాగా చేస్తుందన్న నమ్మకం నాకూ, సమాజం వాళ్ళకీ కల్గింది.

రిహార్సల్ మొదలైంది. నేను రోజూ రిహార్సల్‌కి వెళ్ళేవాణ్ని. అక్కడక్కడ కావల్సిన మార్పులు, చేర్పులు చేస్తూండేవాణ్ని. రోహిణికి నేనంటే ఎంతో గౌరవం. ఆమెకూడా నన్ను "మాష్టారూ," అని పిల్చేది.

ఓ రోజు మాటల సందర్భంలో ఆ నాటికలోని

పాత్ర నేను సృష్టించింది కాదనీ, సజీవమైనదనీ చెప్పాను రోహిణికి. అరవింద కథంతా పూర్తిగా చెప్పాను. అలా చెప్పడం వల్ల ఆమె పాత్రను సరిగా అర్థం చేసుకునే అవకాశం కల్గుతుందని నాకనిపించింది. పూర్తిగా విన్నాక "మాష్టారూ! ఆమె మీ హృదయం మీద ఎలాంటి ముద్ర వేసిందో నేనర్థం చేసుకోగలను. మీ అరవింద పాత్రకు పూర్తి న్యాయం చేకూరుస్తాను. నన్ను నమ్మండి—" అంది రోహిణి.

రవీంద్రభారతిలో 'రాలిన మల్లె' నాటిక మొదటి ప్రదర్శన జరిగింది. నాటిక జరిగినంతసేపు అరవింద నా కళ్ళముందు కదలింది. అదే నవ్వు, అదే ఉత్సాహం, అదే చలాకీతనం.

ఎంత ఆపుకున్నా నాటిక జరిగినంతసేపూ కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతూనే ఉన్నాయ్.

రోహిణిని హృదయపూర్వకంగా అభినందించాను. మర్నాడు వాళ్ళింటికి వెళ్ళి మంచి చీర బహుమతిగా ఇచ్చాను.

"మాష్టారూ! మీరిచ్చిన కానుక, మీ ఆశీస్సు నాకు ఎన్నో ఎవార్డుల పెట్టు. మీ అభిమానాన్ని ఎప్పటికీ దాచుకుంటాను." అంది.

ఆ నాటికను ఎన్నో పోటీల్లో ప్రదర్శించారు. చాలా బహుమతులొచ్చాయి. నటిగా రోహిణికి, రచయితగా నాకు మంచి గుర్తింపు వచ్చింది. తర్వాత ఆమె మరో రెండు మూడు నాటకాల్లో నటించింది. నటిగా ఆమె ఎంతో ఎదిగింది. నేను కనిపించినప్పుడల్లా ఎంతో వినమ్రంగా ఆప్యాయంగా మాట్లాడేది.

కొన్నాళ్ళ తర్వాత ఓ స్నేహితుడు నన్ను వెంకట్రావనే ఒక సినిమా నిర్మాతకి పరిచయం చేసాడు.

వెంకట్రావ్ నేను రాసిన 'రాలిన మల్లె' నాటిక రాజమండ్రిలో చూశాడు. ఆ సబ్జెక్ట్ అతనికి ఎంతో నచ్చింది. ఆ ఇతివృత్తాన్ని ఆధారంగా తీసుకుని ఓ బడ్జెట్ చిత్రం తియాలని అతని ఉద్దేశ్యం. నేను వెంటనే సరేనన్నాను. 'అరవింద' ఆ రకంగా తెలుగు ప్రేక్షకు లందరికీ పరిచయమౌతుందని నేను చాలా సంతోష పడ్డాను. రెండు రోజులు ఆ సబ్జెక్ట్ మీద నేనూ వెంకట్రావు చర్చించాం. అతను చెప్పిన మరో విషయం నాకు మరీ సంతోషాన్ని కలిగించింది. ఆయన రోహిణి నటనను చూశాడు. ఆమెనే తన చిత్రంలో 'నాయకి' గా పరిచయం చెయ్యదల్చుకున్నాడు.

నా నాటిక ద్వారా నటియైన రోహిణి ఉజ్వల భవిష్యత్తుని అందుకోబోతోంది. నేను చాలా గర్వంగా ఫీలయ్యాను.

మర్నాడుదయం రోహిణి ఇంటికెళ్ళి అభినందించాను. వెంకట్రావు ఆ రాత్రే మద్రాస్ వెళ్ళిపోయాడు. ఇరవై రోజుల తర్వాత ఆఫీస్‌కి వెంకట్రావ్ నుంచి ఫోన్ వచ్చింది. తనను హోటల్‌లో ఆ రోజు సాయంత్రం ఆరింటికి కలవమని చెప్పాడు. సరే నన్నాను.

కాని—ఆరోజు మధ్యాహ్నం మొదలైన అఫీషియల్ మీటింగు రాత్రి తొమ్మిదింటికి ముగిసింది. ఆ టైంలో వెళ్ళడమా మానడమా అనే సందిగ్ధంలో పడ్డాను.

కనీసం వెళ్ళి సారీ అనైనా చెప్దామని హోటల్ రూమ్‌కి వెళ్ళాను. వెంటిలేటర్‌లోంచి లైటు వెలుతురు కనబడుతోంది. కాలింగ్‌బెల్ నొక్కాను. వెంకట్రావు తలుపుతీశాడు. కళ్ళు ఎర్రగావున్నాయి.

తాగాడనిపించింది.

"రండి...ఏమిటింత లేటుగా వచ్చారు?"అన్నాడు.

కారణం చెప్పాను.

మర్నాడు కలుస్తానని చెప్పి కుర్చీలోంచి లేచాను.

ఇంతలో ఏంటీ రూం తలుపు తెరుచుకుంది.

లోపల్నుంచి పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తూలుతూ బైటికి వచ్చింది. ఆమె అర్ధనగ్నంగా వుంది. కనురెప్పలు మూసుకుపోతున్నాయి. తిలకంబొట్టు నుదురంతా పులుముకుపోయింది. ఆమె చేతిలో గ్లాసుంది. అందులో విస్కీ వుంది.

"వై డన్ లేట్ డార్లింగ్" అంటూ వెంకట్రావు వైపు రాబోయింది. తూలింది. బోర్లాపడి నేలకి అంటుకుపోయింది.

గచ్చుమీద పడి గ్లాసు పగిలింది — నా గుండె ముక్కలైనట్టనిపించింది,

విస్కీ నేలమీద పారుతోంది — నా రక్తం రూమంతా ఒలికి పారుతున్నట్టనిపించింది.

వెంకట్రావు ఆమెను లేవదీసి నిలబెట్టాడు. అతి కష్టంమీద నిలబడి ఆమె అతని భుజంపై తల ఆన్చింది. మెల్లగా నడిపించుకుంటూ ఆమెను లోపలి గదిలోకి తీసుకుపోయాడు. నేను వెళ్ళొస్తానని కూడా చెప్పకుండా బైటికి వచ్చేసాను. మెట్లు దిగుతూ అనుకున్నాను......

"స్కాండ్రల్"

ఆమె రోహిణి—

* * *

నమ్మలేనట్టు చూసింది యశోధర.

"నిజం యశూ ! నా అరవింద మాత్రం అలాటిది కాదు. సూర్యరశ్మిలో వున్న పవిత్రత, మల్లెపూవులోని స్వచ్ఛత ఆమెలో వున్నాయి. అలాటి అరవింద నారోహిణిలో వూహించి పొరపాటు చేశాను."

"మీ రచయితలంతా ఒట్టి ఫూల్సండి—మరి ఇంత సెన్సిటివ్‌గా ఉంటారేం? మీరా నాటిక రాశారు. మీరు రచయిత. ఆమె అందులో నటించింది —ఆమె నటి— మీ ఇద్దరి సంబంధం అంతవరకే – అలాటి వాళ్ళతో ఎమోషనల్‌గా ఇన్వాల్వ్ కాకూడదు – ఇలానే బాధ పడాల్సొస్తుంది—" అంది యశోధర.

"అవును — ఆమె నటి — నటిస్తుంది," అనుకున్నాను.

అంతవరకు మనస్సులో వున్న మబ్బులు వీడిపోయినట్టనిపించింది.

ఆ రాత్రి యశోధర గుండెల్లో హాయిగా నిద్రపోయాను.

* * *